క్లుప్తంగా

పాఠశాలకు స్టేజీ, సీసీ కెమెరాల నిర్మాణం

కారంచేడు: మండలంలోని కుంకలమర్రు ఉన్నత పాఠశాలకు అవసరమైన వేదిన నిర్మాణంతో పాటు, రక్షణకు అవసరమైన సీసీ కెమెరాల నిర్మాణం చేపట్టాలని ఎంఈఓలు, హెచ్ఎం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, పర్చూరు మాజీ ఏఎంసీ చైర్మన్ జువ్వా శివరాం ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పాఠశాల ఆవరణ ఉత్తమ ఉపాధ్యాయుడు మొలబంటి ప్రభూజీ సన్మాన కార్యక్రమానికి హాజరైన శివరాంప్రసాద్‌తో ఈ విషయమై చర్చించిన వెంటనే ఆయన స్పందించి పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవసరమైన స్టేజీ నిర్మాణంతో పాటు, బాలికలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల రక్షణకు అవసరమైన సీసీ కెమెరాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని హెచ్ఎంకు సూచించారు. వాటికి అయ్యే ఖర్చును పూర్తిగా తానే భరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఈఓలు సత్యన్నారయణ, వెంకటేశ్వర్లు, హెచ్ఎం పద్మావతిలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్వర్టర్ బహూకరణ



ఇన్వర్టర్ అందజేస్తున్న దాతలు విశ్రాంత ఉద్యోగులు

అద్దంకి: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయానికి తరచుగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతండడతో ఇన్వర్టర్ అవసరం ఏర్పడింది. ఈ వసరాన్ని గుర్తించిన ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘ అద్దంకి కార్యదర్శి టీ కృష్ణయ్య, లక్కరాజు చంద్రశేఖర్‌ల సౌజన్యంతో శుక్రవారం ఇన్వర్టర్‌ను ట్రెజరీ కార్యాలయానికి అందజేశారు. ఈ ఇన్వర్టర్ ఖరీదు రూ.24 వేలు విలువ ఉంటుందని చెప్పారు. ఇన్వర్టర్‌ను సబ్‌ట్రెజరీ కార్యాలయ అధికారి కే లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, కొప్పరపు అశ్వత్థ నారాయణ, లక్కరాజు చంద్రశేఖర్, షేక్ యస్‌జీ సైదా, మారం కోటేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

వేటపాలెం ఎంపీడీవోగా రూతమ్మ



బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రూతమ్మ

వేటపాలెం: మండల ఎంపీడీవోగా సీహెచ్ రూతమ్మ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. దాదాపు రెండేళ్లగా ఎంపీడీవో ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జ్ ఎంపీడీవోలుగా పదవులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చీరాల ఎంపీడీవో వేటపాలెం ఎంపీడీవో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. నూతనంగా రూతమ్మ బదిలీపై ఇక్కడకు రావడంతో పూర్తి బాధ్యతలు అప్పగించారు. గతంలో రూతమ్మ ఇదే కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ



పోషకాహార మాసోత్సవాల్లో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

జే.పంగులూరు: పోషకాహార మాసోత్సవాల సందర్భంగా బైటమంజులూరు గ్రామ సర్పంచ్ చక్రవరం రుక్మిణి తిరుమల రాజు పౌష్టికాహార కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం టీచర్ జి సుజాత, హెల్పర్ ఎస్ అనంతలక్ష్మి, మహిళా పోలీసు డి రాధమ్మ, గ్రామ పెద్ద సుబ్బరాజు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం: రామన్నపేటలోగల 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. నాయనపల్లి, మార్కెట్ సెంటర్, రామకృష్ణ థియేటర్, రామన్నపేట, సమైఖ్య నగర్, సర్వోదయ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరపరా నిలుపుదల చేస్తారని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పురుగు మందుల వాడకం తగ్గించాలి

ఇంకొల్లు (చినగంజాం): రైతులు తమ పంటలకు ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించాలని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని వంకాయలపాడు గ్రామ పరిధిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో కషాయం తయారు చేయటం దాని ఉపయోగాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా 5 రకాల ఆకులతో అవగాహన సదస్సులో కాషాయం తయారు చేశారు.

జీవితాల్లో వెలుగు నింపేదే అక్షర జ్ఞానం



ఇదుపులపాడులో పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్ఎం పేరిరెడ్డి



ముప్పవారిపాలెంలో విద్యార్థులు తయారు చేసిన అక్షర చిత్రం

● అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం

చినగంజాం: అంధకారపు చీకట్లను పారదోలి జీవితాల్లో వెలుగు నింపేదే అక్షర జ్ఞానం అని.. ప్రతి ఒక్కరూ చదువు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి అన్నారు. మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయిని పీ హిమవంతేశ్వరి సహకారంతో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా చక్కటి చిత్రాన్ని రూపొందించారు. తెలుగు భాషలో 'అ' అక్షరాన్ని, అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లిషులోని ఏ, బీ అక్షరాలను చూపుతూ పూలతో చిత్రాలు ఏర్పాటు చేశారు. విద్యాదీపం అందరి జీవితాల్లో చీకట్లను పారదోలి వెలుగును నింపాలనే అనే సందేశంతో కొవ్వొత్తులను అలంకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ఎన్ చంద్రశేఖర్ మనిషిని మహోన్నతుడుగా తీర్చి దిద్దేది విద్య ఒక్కటేనని ప్రతి ఒక్కరూ చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధం నాగమల్లేశ్వరరావు, హిమవంతేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఇంకొల్లు మండలం ఇదుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో హెచ్ఎం అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం గురించి, అక్షరాస్యత ఆవశ్యకతను గురించి ఆయన వివరించారు. యునెస్కో సెప్టెంబర్ 8 వ తేదీని అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పీ పావని,బీ శివలీల, పావని, ఏ సురేష్, వసంత రఘుబాబు, సీహెచ్ శ్రీ విద్యాలక్ష్మి, పెండ్యాల రాధిక, జీ సంధ్యారాణి, ఏ అపర్ణ, కే నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

'అచ్చ తెనుగు పదకోశం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ మారెడ్డి అంజిరెడ్డి తదితరులు

ఒంగోలు: అచ్చ తెనుగు పదకోశం పుస్తకావిష్కరణ కార్యక్రమం స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం వైభవంగా జరిగింది. యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకం రాయడం అంత సులవైన విషయం కాదన్నారు. అచ్చతెనుగు పదకోశం పుస్తక రచయిత విద్వాన్ జ్యోతి చంద్రమౌళి సేవలను ఆయన ప్రశంసించారు. తాను ఒక ప్రొఫెసర్‌గా 7 పుస్తకాలు రాశానని, అందులో ఒక పుస్తకాన్ని యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఆవిష్కరించినట్లు చెప్పారు. పాఠకుల ఆన్‌లైన్ వీక్షణ పెరిగినందున కవులు కూడా తమ పుస్తకాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సిన అవసరాన్ని వివరించారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ హరిబాబు మాట్లాడుతూ పుస్తకం హస్తభూషణం అని, అన్నింటికీ గూగులమ్మ పరిష్కారం చూపలేదని, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేలా ప్రత్యేక చర్యలు అవసరం అన్నారు. యూనివర్శిటీ డీన్ డి.వెంకటేశ్వరరెడ్డి, శర్మ కాలేజీ హిస్టరీ లెక్చరర్ కొండా శ్రీనివాసులు మాట్లాడుతూ జాతి ఔన్నత్యానికి ప్రతీక భాష అని, అటువంటి తెలుగు భాష ఔన్నత్యానికి అవసరమైన పదకోశాన్ని రూపొందించిన జ్యోతి చంద్రమౌళి కృషి అమూల్యం అన్నారు. రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ యు.దేవపాలన , రచయిత ఎంవీఎస్ శాస్త్రి మాట్లాడుతూ తెలుగు పదకోశాలు చాలా ఉన్నాయని, కానీ అచ్చ తెనుగు పదకోశం ఆవశ్యకత ఏమిటి అనేది పుస్తకం చదివితేనే తెలుస్తుందన్నారు. ప్రపంచీకరణ, పాశ్చాత్యీకరణ నేపథ్యంలో తెలుగుభాషలో పరభాషా పదాలు జీర్ణం అయ్యాయని, అయినప్పటికీ మన భాష గొప్పదనాన్ని ప్రపంచానికి వివరించాల్సిన బాధ్యత కవులు, రచయితలపైనే ఉందన్నారు. పుస్తక రచయిత విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ తెలుగుభాషలో నేడు పలు అక్షరాలు సైతం మాయమయ్యాయని, నాలో ఉన్న జ్ఞాన సంపదను పదిమందికి పంచాలనే ఉద్దేశంతోనే పుస్తకాన్ని ముద్రించినట్లు చెప్పారు. మనం రాసిన పుస్తకం సమాజ హితం అయినప్పుడు కలిగే ఆనందం పైసలతో రాదన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత జ్యోతి చంద్రమౌళిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు తదితరులు పాల్గొని పుస్తకంపై సమీక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



ప్రభూజీని సత్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కుంకలమర్రు (కారంచేడు): ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సత్కారం లభించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో అవార్డును తీసుకున్న కుంకలమర్రు ఉన్నత పాఠశాల లెక్కల మాస్టారు మొలబంటి ప్రభూజీని గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభూజీని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ప్రభూజీ ఇంగ్లిషు మీడియం బోధనలో విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా బోధించడంతో పాటు, వారిలో నైపుణ్యాలను సైతం గమనించుకుంటూ చేస్తారని పలువురు వక్తలు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, ఎం వెంకటేశ్వర్లు, పర్చూరు మాజీ ఏఎంసీ చైర్మన్ జువ్వా శివరాంప్రసాద్, గ్రామ సర్పంచ్ ఈదర సౌందర్య, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వెంకటప్పయ్య, హెచ్ఎం పద్మావతి, రావి హనుమంతరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు



బియ్యం స్టాక్ పరిశీలిస్తున్న ఈడీటీ శరత్

చీరాల: ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే సంబంధిత డీలర్లపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శరత్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పేరాలలో 17, 9, 6, చీరాలలోని 11, 12 రేషన్ దుఖాణాలను ఆకస్మికంగా తనఖీ చేశారు. దుఖాణాలకు కేటాయించిన రేషన్ బియ్యం రికార్డులు, స్టాక్ రిజిస్టర్, పంపిణీ చేసిన రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యాన్ని కార్డుదారుల నుంచి కొనుగోలు చేయడం, అక్రమంగా నిల్వ ఉంచిన డీలర్లపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. డీలర్లు విధిగా రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. ఈడీటీ వెంట సిబ్బంది ఉన్నారు.

రైస్ షాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వేటపాలెం: వివిధ ప్రాంతాల్లో రైస్ షాపుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రైస్ షాపులకు తీసుకున్న అనుమతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఓంకార్, నిరంజన్‌లు మాట్లాడుతూ వేటపాలెం ప్రధాన సెంటర్‌లో గల రైస్ షాపుల్లో బియ్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. అదే విధంగా ధరలు, కాటాలో తేడాలు వస్తున్నట్లు చెప్పారు. షాపుల్లో విక్రయిస్తున్న బియ్యాన్ని పరిశీలించారు. ప్రతి షాపు వద్ద వారు విక్రయిస్తున్న బియ్యం రకాలు, ధరలు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదే విధంగా షాపులపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

రేపు బాపట్లలో వేడుకోలు దీక్ష

మార్టూరు: సమస్యల పరిష్కారం కోసం రేపు ఆదివారం బాపట్ల జిల్లా కేంద్రంలో వేడుకోలు దీక్ష నిర్వహించనున్నట్లు ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ మండల శాఖ నాయకులు శుక్రవారం తెలిపారు. స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులను రెగ్యులర్ చేయటం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోనికి మార్చడం తదితర డిమాండ్ల పరిష్కారం కోసం దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రమేష్, శ్రీనివాసరావు, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా రైతు అధ్యక్షుడు పేరయ్య

బల్లికురవ: ఆరోగ్యవంతమైన సమాజస్థాపనకు ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను ఇంటింటా సర్వేను గ్రామాల వారీగా చేపట్టాలని జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య కోరారు. శుక్రవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో జేఏఎస్‌పై సచివాలయ సెక్రటరీలు, వైద్యారోగ్యశాఖ అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పేరయ్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వివిధ రకాల పరీక్షలతో మెరుగైన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. ఈనెల 15 నుంచి జరిగే ఇంటింటా సర్వేలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని సైతం గుర్తిస్తారన్నారు. రోగులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తారని పేరయ్య వివరించారు, సర్వేను, గ్రామాల వారీగా కట్టుదిట్టంగా పూర్తిచేయాని కోరారు. సదస్సులో ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహసీల్దార్ కె. రవికుమార్, ఎంఈవో కె. రమేష్‌బాబు, గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ పాల్గొని మాట్లాడారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు

బల్లికురవ: పొలాల్లో వ్యవసాయానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై విద్యుత్‌శాఖ ఏఈ పీ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వేమన తెలిపారు. గొర్రెపాడు, కొత్తూరు గ్రామాల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురైనట్లు ఎస్సై వివరించారు.

కూరగాయల సాగుతో అదనపు ఆదాయం



కూరగాయల విత్తనాలు నాటుతున్న కూలీలు

బల్లికురవ: ప్రకృతి వ్యవసాయంలో ప్రతి రైతు 20 సెంట్లకు తగ్గకుంగా కూరగాయల సాగుతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జులు కల్పన, నాగూర్‌వలి తెలిపారు. శుక్రవారం మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆకుకూరలు, కూరగాయాలకు మంచి గిరాకీ ఉందన్నారు. పంటలను ప్రతిరోజు ఆహారంలో తీసుకుంటే ఎలాంటి వ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. బెడ్ల ఏర్పాటుతో కూరగాయాలు సాగు చేపట్టటం వల్ల నీటి ఆదాతో పాటు చీడ పీడలు ఆశించవని, వర్షాధారంగా కూడా సాగు చేపట్టవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు నాగలక్ష్మీ , శ్రీదేవి పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయణం, నిజ శ్రావణ మాసం, రోహిణి నక్షత్రం, నవమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఘనంగా శ్రావణ మాసం పూజలు



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

చీరాల టౌన్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండలంలోని కొత్తపాలెం గ్రామపంచాయితీలో కొలువైన పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు, ఆకుపూజలను వైభవంగా జరిపించారు. అనంతరం గ్రామోత్సవాన్ని జలబిందెలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఏర్పాట్లను దేవస్థాన చైర్మన్ బక్కా శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

ప్రజల గుండెల్లో సీఎం జగన్



మహిళలతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

● ఏపీ శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య



దివ్యాంగుడిని పలుకరిస్తున్న చైతన్య

సంతమాగులూరు (అద్దంకి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం సంతమాగులూరు మండలంలోని సజ్జాపురం గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తుమ్ముడూ బాగున్నావా.. అన్నా బాగున్నావా, అవ్వా ఎలా ఉన్నావ్ అంటూ పలుకరిస్తూ, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గూడు లేని వారికి గూడు, పేదలకు వివిధ పథకాల ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తోందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పాఠశాలలను తీర్చిదిద్ది సకల సౌకర్యాలు సమకూర్చిందని చెప్పారు. అదే విధంగా రైతులకు రైతు భరోసా అందించి అన్నదాతలకు అండగా నిలిచిందని చెప్పారు. ఇంత చేస్తున్నా ప్రతిపక్షం పనిగట్టుకుని విమర్శిస్తోందన్నారు. ప్రజలు బాగుంటే ప్రతిపక్షం ఓర్వలేకపోతోందన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వానికి తప్పులు తెలియజేయాల్సిన ప్రతిపక్షం మంచిని తప్పుగా ప్రజలకు చెబుతుందని, దాన్ని ఎవరు నమ్మరన్నారు. ఈసారి మరలా ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నారని చెప్పారు. లేనిపోని అబద్ధాలు పోగేసి చెబితేనమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యకర్తలు నాయకులు, ప్రతిపక్షం చేసే తప్పుడు విమర్శలను తప్పి కొట్టే విధంగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న పథకాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మండల నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, వలంటీర్లు, సచివాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాబూరావు

చీరాల టౌన్: అత్యవసర పరిస్థితిల్లో గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ ప్రథమ చికిత్స చేయడంతో ప్రాణాలను కాపాడవచ్చునని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఐ.బాబురావు సూచించారు. రోటరీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని వైఏ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డాక్టర్ బాబూరావు పర్యవేక్షణలో గుండె పోటు వచ్చిన వారికి అంబులెన్స్ వచ్చే లోపల ప్రాణాలకు కాపాడే విధానంలో సీపీఆర్ చికిత్స ముఖ్యమైందన్నారు. రోటరీక్లబ్ అందిస్తున్న సమాజ సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణమ్మ, ఉపాధ్యాయులు సౌభాగ్య, లక్ష్మీ, విద్యార్థినులు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజాభివృద్ధి



ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న రోటరీ ప్రతినిధులు

ఇంకొల్లు(చినగంజాం): అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా గంగవరంలోని వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ తరపున నేషన్ బిల్డర్స్ అవార్డుతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కొర్రపాటి వీరాంజనేయులు క్లబ్ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి), కోశాధికారి చుండి సాంబశివరావు, డైరక్టర్ మద్దినేని హనుమంతరావు, సోమేపల్లి రామ్మోహనరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణ, గ్రామ సర్పంచ్ బెల్లం సుధాకరరావు, యంపీటీసీ మేకల రాజగోపాలరెడ్డి, పాఠశాల వ్యవస్థాపక కుటుంబ సభ్యులు వలేటి ఆంజనేయులు, రిటైర్డ్ పీఈటీ పత్తిపాటి వెంకటేశ్వర్లు, హింది పండిట్ వలేటి సుబ్బాయమ్మ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు వెంకటేశ్వర్లు రూ.50 వేలు విరాళం అందజేశారు.

మనోధైర్యంతో ముందుకు వెళ్లాలి



దివ్యాంగులకు సామగ్రి అందిస్తున్న డాక్టర్ కొండలరావు

చీరాల: మానసిక దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకెళ్లాలని ఐకాన్ హాస్పిటల్ అధినేత, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం అధ్యక్షుడు శంకరశెట్టి కొండలరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో విఠల్‌నగర్‌లోని చైతన్య మనోవికాస కేంద్రంలో జాతీయ ఫిజియోథెరపిస్ట్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మనో వికాసకేంద్రం చైర్మన్ వెంకన్నబాబు, ఫిజియోథెరపిస్టులు మాధురి, ప్రసన్న, దివ్యం, ఐకాన్ సిబ్బంది ఉన్నారు.